క్లుప్తంగా

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

పెంచికల్‌పేట్: మండలంలోని పెంచికల్‌పేట్–లోడుపల్లి ప్రధాన రహదారిపై మంగళవారం బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై కొమురయ్య తెలిపిన వివరాల ప్రకారం కాగజ్‌నగర్‌కు చెందిన హజర్‌హుస్సేన్ కొండపల్లి వెళ్తున్న క్రమంలో పెంచికల్‌పేట్ పెట్రోల్ బంక్ వద్ద అదుపుతప్పి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు సమాచారం అందుకొని చికిత్స నిమిత్తం పెంచికల్‌పేట్‌కు అక్కడి నుంచి కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

‘ఆదివాసీ కుటుంబాలకు అండగా ఉంటాం’



దుప్పట్లు అందజేస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: జిల్లాలోని ఆదివాసీ కుటుంబాలకు ఎప్పుడూ అండగా ఉంటామని ఎస్సై డి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా గోలేటి పంచాయతీ పరిధి కొలాంగూడ, పటేల్‌గూడ ఏజెన్సీ గ్రామాల 50 ఆదివాసీ కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎస్సై మాట్లాడుతూ రెబ్బెన పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆదివాసీ కుటుంబాలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గిరిజనుల శ్రేయస్సు కోసం పోలీస్‌శాఖ ఎల్లవేళలా సాయపడుతుందని పేర్కొన్నారు.

ఘనంగా ‘గొంతెమ్మ’ బోనాలు



ఆలయం వద్ద బోనాలతో మహిళలు

పెంచికల్‌పేట్: మండలంలోని మెరెగూడ గ్రామంలోని గొంతెమ్మ ఆలయం వద్ద బోనాల పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. భాజాభజంత్రీలతో అమ్మవారు, నిషానులు, దేవతా మూర్తుల ఊరేగింపు అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఆలయ సమీపంలో మహిళలు బోనంతో అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

22న విస్తృతస్థాయి సమావేశం

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఈనెల 22న పేదరిక నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో ఉపాధికూలీలు, మేట్ల తాలుకాస్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నట్లు సమితి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రగిరి సుదర్శన్ తెలిపారు. మంగళవారం కాగజ్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ఆయా మండలాల ఉపాధిహామీ కూలీలు, మేట్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఉపాధిహామీ కూలీలు, మేట్లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అయోధ్య అక్షింతల పంపిణీ



కెరమెరి: అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

కెరమెరి: మండల కేంద్రంలో అయోధ్య అక్షింతలను మంగళవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. భాజాభజంత్రీల నడుమ అక్షింతలతో ఊరేగింపు నిర్వహించారు.

చింతలమానెపల్లి: మండలంలోని అడెపెల్లి, హేటిగూడ గ్రామాలలో మంగళవారం రాములవారి అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో మంగళవాయిద్యాలు, మంగళహారతులతో ఊరేగింపు నిర్వహించారు.

క్రీడాసామగ్రి పంపిణీ



క్రీడాసామగ్రి అందజేస్తున్న సర్పంచ్

రెబ్బెన: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చెన్న సోమశేఖర్ అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ వెంకటి, వార్డు సభ్యులు సంజీవ్‌కుమార్ జైస్వాల్, నాయకులు మున్నా, క్రీడాకారులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ ఎలా..?

- కెరమెరి రేంజ్‌లో సిబ్బంది కొరత
- 24వేల హెక్టార్లలో విస్తీర్ణం



కెరమెరిలోని అటవీ రేంజ్ కార్యాలయం



పరంధోలిలో దట్టమైన అడవులు

కెరమెరి: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాగా మారిన తర్వాత కెరమెరి, జైనూర్, సిర్పూర్(యూ) మూడు మండలాలను కలిపి కొత్తగా కెరమెరిలో అటవీ రేంజ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. కానీ సరిపడా సిబ్బందిని నియమించకపోవడంతో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. జిల్లాలోనే అత్యధిక విస్తీర్ణం గల రేంజ్ కావడం.. కలప అధికంగా ఉండడంతో అక్రమ కలప రవాణా అటవీ అధికారులకు పెద్ద తలనొప్పిగా మారింది. సిబ్బంది చాలా తక్కువగా ఉండడంతో అటవీ సంరక్షణ చాలా కష్టమవుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

ఏడుగురే సిబ్బంది..

కెరమెరి రేంజ్ పరిధిలో మూడు మండలాలు ఉన్నాయి. ఈ రేంజ్‌లో సెక్షన్ అధికారులు 10 మంది, బీట్ అధికారులు 26 మంది విధుల్లో ఉండాలి. కానీ ఇక్కడ కేవలం ఏడుగురు బీట్ అధికారులు, ముగ్గురు సెక్షన్ అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. మూడు మండలాలు కలిపి 24వేల హెక్టార్లలో (సుమారు లక్ష ఎకరాల్లో) అడవులు వ్యాపించి ఉన్నాయి. మూడు మండలాల్లో కలప కూడా పుష్కలంగా లభిస్తుండడంతో అక్రమార్కులు కలప రవాణా చేసే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

మొదటి నుంచి ఇదే పరిస్థితి

రేంజ్ కార్యాలయం ప్రారంభం నుంచి సరిపడా సిబ్బందిని ఇక్కడ నియమించలేదు. దీంతో అడవుల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. గతంలో పలు ప్రాంతాల్లో బీట్, సెక్షన్ అధికారులను భర్తీ చేసినప్పటికీ ఇక్కడ మాత్రం ఒక్కరిని కూడా నియమించలేదు. ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తుండడంతో అడవుల సంరక్షణ వారికి తలకు మించిన భారంగా మారింది. అధికారులు తక్షణమే స్పందించి సరిపడా అటవీ సిబ్బందిని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

సిబ్బందిని నియమించాలి



రేంజ్‌లో సరిపడా సిబ్బంది లేకపోవడంతో చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. కెరమెరిలో దట్టమైన అడవులు ఉండడంతో రక్షణ కష్టంగా మారింది. పది మంది సిబ్బందితో లక్ష ఎకరాలను కాపాడడం అసాధ్యంగా మారింది. అధికారులు స్పందించి తక్షణమే సిబ్బందిని నియమించాలి.

– సయ్యద్ మజారోద్దిన్, ఎఫ్ఆర్‌వో

ఏఐటీయూసీ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న జీఎం రవి ప్రసాద్

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మంగళవారం ఏఐటీయూసీ నూతన సంవత్సర డైరీని బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ ఆవిష్కరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ సింగరేణిలో పని చేస్తున్న కార్మికుల కోసం నిత్యం అండగా ఉంటూ, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలతో పాటు, చట్ట ప్రకారం దక్కాల్సిన వసతుల కోసం నిరంతరం పోరాడుతోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సయ్య, సింగరేణి కోల్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ గోలేటి బ్రాంచి అధ్యక్షుడు స్వామి, కార్యదర్శి రవిప్రసాద్, నాయకులు సంతోష్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: అడవుల్లో ఉండే వన్య ప్రాణులను సంరక్షించుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ అధికారి సాయి చరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని షాకన్‌గొంది గ్రామంలో గిరిజనులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ తీగలు అమర్చడం, జంతువులను వేటాడడం, ఉచ్చులు వేయడం, విష ప్రయోగాలు చేయడం నేరమన్నారు. ఎవరైనా వన్యప్రాణులకు హాని కలిగించే వారు కనిపిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. అటవీ జంతువుల నుంచి గాయపడిన, మృతిచెందిన ఆవులు, మేకలు, గేదెలకు తక్షణ సాయం కింద రూ.5వేలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీట్ అధికారి శ్రీనివాస్, సర్పంచ్ పార్వతి, గ్రామస్తులు తిరుపతి, భీము తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న కోనేరు కోనప్ప

బెజ్జూర్: మండలంలోని ఎలుకపెల్లి గ్రామానికి చెందిన మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుర్రంగి రామకృష్ణ తండ్రి వారం రోజుల క్రితం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంగళవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు జగ్గా గౌడ్, సతీశ్, జావిద్, వెంకన్న, మహేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు మానసికోల్లాసం



జైనూర్: క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

జైనూర్: క్రీడలతో యువతకు మానసికోల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులు అన్నారు. సోమవారం మండలంలోని ఉశేగాం గ్రామంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గణేశ్ యూత్ ఆధ్వర్యంలో కబడ్డీ క్రీడా పోటీలు ప్రారంభించారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి క్రీడా పోటీలు ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కుమ్ర భగవంత్‌రావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు మడావి భీంరావు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

కబడ్డీ పోటీల విజేత ‘ నర్సాపూర్’

రెబ్బెన: మండలంలోని గోలేటి గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల విజేతగా నర్సాపూర్ జట్టు, ద్వితీయ స్థానంలో పెర్కపల్లి జట్టు నిలిచాయి. ఎస్సై చంద్రశేఖర్, గోలేటి సర్పంచ్ పోటు సుమలత విజేతలకు బహుమతులు అందజేశారు.

కెరమెరి: మండలంలోని చిన్నసాకడ (శ్యాంరావుగూడ)లో పెందోర్ జంగు స్మారకార్థం మూడు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. మొత్తం 40 టీంలు పాల్గొనగా నిషాని జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో ఆదివాసీ నగర్, మూడో స్థానంలో సుర్దాపూర్ జట్లు నిలిచాయి. ఎంపీపీ పెందోర్ మోతీరాం, చాహకటి శ్యాంరావు ఆనంద్‌రావు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

చింతలమానెపల్లి: మండలంలోని బాబాపూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. విజేతలకు ఎంపీటీసీ చాప్లె రోజ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, కోటేష్, రామయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం..

మండలంలోని రవీంద్రనగర్‌లో నేతాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు సుధాకర్ రావు, మల్లయ్యలు పోటీలను ప్రారంభించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



కౌటాలలో మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు నారులే వానుపటేల్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ గ్యారంటీ, అటల్ పింఛన్ యోజన, ఉజ్వల యోజన, ఫసల్ బీమా యోజన, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, విశ్వకర్మ యోజన, తదితర వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి, ఏఈవో ఘన్‌శ్యాం, హెచ్‌పీ డీలర్ జానకీరాం, యాత్ర నిర్వాహకులు సమీర్‌గుప్తా, ప్రశాంత్, సిబ్బంది మందాకిని, మోగ్ర, నాయకులు మితున్, సత్తయ్య, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

జైనూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో పాటు పరిసరాల పరిశుభ్రతపై మండలంలోని జంగాం వారసంతలో కళాజాత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. స్థానిక భాషలో పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మరప సుదర్శన్ ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు



పితృదేవతలకు పూజలు చేస్తున్న భక్తులు



అగ్ని దేవతకు మొక్కుతున్న మహిళలు

కెరమెరి: కొలాం ఆదిమ గిరిజనులు ఓంపురి వంగెపురి భీమయ్యక్, రాజుల్ దేవతలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండలంలోని చిన్న పాట్నాపూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం ప్రారంభమైన పూజలు మంగళవారం ముగిశాయి. దేవతలకు మహాపూజ నిర్వహించారు. కొత్త కోడళ్లు భేటింగ్ అయ్యారు. కెరమెరి, వాంకిడి, జైనూర్, లింగాపూర్, కాగజ్‌నగర్ మండలాలకు చెందిన భక్తులు, మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాకు చెందిన ఆదివాసీలు పూజలు నిర్వహించారు.



ఓంపురి భీమయ్యక్ దేవతలకు పూజలు చేస్తున్న మహిళలు

ఘనంగా సంక్రాంతి వేడుకలు



కెరమెరి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



రెబ్బెన: గోలేటిలో..



దహెగాం: పోటీల్లో పాల్గొన్న యువతులు



ఆసిఫాబాద్: ముగ్గుల పోటీల్లో మహిళలు



ఆసిఫాబాద్‌రూరల్: పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ

దహెగాం: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని లగ్గాం గ్రామంలో ఉమా చంద్రశేఖర స్వామి యువజన సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై సనత్‌కుమార్ హాజరయ్యారు. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా మహిళలు వాయినాలు ఇచ్చుకున్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమ, మంగళవారాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే లేచి భోగి మంటలు చేశారు. వాకిళ్లను గొబ్బెమ్మలతో అలంకరించారు.

కెరమెరి: మండలంలోని చొపన్‌గూడ గ్రామంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా మంగళవారం చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన 58 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. ఎంపీపీ మోతీరాం, యువజన సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు విజేతలకు బహుమతులు అందించారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, సర్పంచ్ జగన్నాథ్ రావు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు సోమవారం సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం ఇతర గ్రామాల్లో స్థిరపడిన ప్రజలు సొంత గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లో సకినాలు, ఇతర పిండి వంటకాలు చేశారు. ఇళ్ల ముందు రంగురంగులతో అందమైన ముగ్గులు వేశారు. గ్రామాల్లో గంగిరెద్దులు ఆటలతో సందడి చేయగా, చిన్నారులు పతంగులు ఎగురవేశారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శివకేశవ మందిర్‌లో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విజేతలకు క్లబ్ ప్రతినిధులు బహుమతులు పంపిణీ చేశారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం సాయంత్రం వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు పతంగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కొలిప్యాక శంకర్, తాటిపెల్లి ఆదిత్య, కోశాధికారి శ్రీధర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

కౌటాల: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు సంక్రాంతి పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గృహాలను పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇళ్లల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, యువతులు ఉదయాన్నే సంక్రాంతి ముగ్గులు వేశారు. మండల కేంద్రంలోని శివాలయం, రామాలయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల ప్రజలు మంగళవారం కనుమ పండుగ ఘనంగా జరుపుకున్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: సంక్రాంతి సందర్భంగా సోమవారం మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఎడ్లబండి పందెలు, కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎంపీపీ మల్లికార్జున్ బహుమతులు అందజేశారు. సర్పంచ్ లక్ష్మి, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, నాయకులు బాలేశ్వర్ గౌడ్, మల్లేష్, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వార్షిక క్యాలెండర్‌ను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మేడి చరణ్ దాస్, జాడి కేశవ్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఎల్ఐసీ ఏజెంట్ పార్వతి శీను కుటుంబ సభ్యులకు శ్రీ మిత్ర సేవాసమితి ఆధ్వర్యంలో రూ.18,200 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతి, సభ్యులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: భవన నిర్మాణ కార్మికులు జాబ్ కార్డు పొందేందుకు ప్రతీ మండల కేంద్రంలో ఆన్‌లైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సప్త బాలకిషన్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా భవన నిర్మాణ రంగంలో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. ఆలస్యమవుతుందనే సాకుతో మీసేవ కేంద్రాల్లో వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరికొంత మంది కార్మికుల వద్ద అదనపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ మండల కేంద్రాల్లో ఆన్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసి, అదనపు చార్జీలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు పెరిక శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

పోడుపట్టాలు అందించి ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న చెన్న సోమశేఖర్

రెబ్బెన: నంబాల గ్రామ పంచాయతీ పరిధిలో పోడు పట్టాలు అందని ఆదివాసీలకు పట్టాలు అందించి ఆదుకోవాలని నంబాల సర్పంచ్ చెన్న సోమశేఖర్ కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ సహదేవరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నంబాల పంచాయతీ పరిధిలో సుమారు 30 మంది పోడు రైతులకు పట్టాలు అందలేదన్నారు. స్పందించిన కలెక్టర్ అర్హులైన ఆదివాసీలకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు.